క్లుప్తంగా

భవానీ మాలధారులచే పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని శరన్నవరాత్ర ఉత్సవాల శిబిరాల్లో భవానీ మాలధారులు బుధవారం విశేష పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంగర, పడమర ఖండ్రిక, కేదారిలంక, వీధివారిలంక, అద్దంకి వారిలంక, నాగులచెరువు, వాకతిప్ప, కోరుమిల్లి, మాచర, టేకి, కాలేరు, నల్లూరు, అచ్యుతాపురం, తదితర గ్రామాల్లోని శిబిరాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.

ఈవోపీఆర్డీగా శ్రీనివాస్

మండపేట: మండలంలో పలువురు అధికారులు కొత్తగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈవోపీఆర్డీగా దాసరి శ్రీనివాస్ విధుల్లో చేరారు. ఆత్రేయపురం మండల ఈవోపీఆర్డీగా పని చేసిన శ్రీనివాస్ మండపేట మండలానికి వచ్చారు. గతంలో ఇక్కడి ఈవోపీఆర్డీగా పని చేసిన ఐదం రాజు ఆలమూరు మండలానికి బదిలీ అయ్యారు. అలాగే పలు పంచాయతీల కార్యదర్శులకు స్థానం చలనం కలిగింది. పాత వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారు. కేశవరం పంచాయతీ కార్యదర్శిగా నల్లమిల్లి సుబ్బారావు, ఏడిద కార్యదర్శిగా పుప్పాల శ్రీనివాస్, మరేడుబాక కార్యదర్శిగా వీవీ ప్రసాద్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. తాపేశ్వరానికి చక్రధర్ రెడ్డి, పాలతోడు కె. వర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

15న కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కె.రత్నకుమారి బుధవారం తెలిపారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును ఆహ్వానించామన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యానికి నిదర్శనం

రోడ్డు పాలవుతున్న తాగునీరు



పామర్రు మెయిన్ రోడ్డుపై పైప్‌లైన్ పగిలి రోడ్డుపై పారుతున్న తాగునీరు

కె.గంగవరం: అధికారుల చిన్నపాటి నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో అందాల్సిన తాగునీరు రెండు నెలలుగా రోడ్డు పాలవుతుంది. మండలంలోని పామర్రు ప్రధాన రహదారి పక్కనే రెండు నెలల క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది కొత్త విద్యుత్ పోల్‌ను ఏర్పాటు చేశారు. ఈ పోల్ ఏర్పాటు చేసినప్పుడు భూమిలో ఉన్న తాగునీటికి సంబంధించిన పైప్‌లైన్ పగిలి పాడయిపోయింది. దీంతో పైప్‌లైన్‌లో నుంచి వెళ్లాల్సిన తాగునీరు బోర్ నుంచి వచ్చే విధంగా రోడ్డుపై పారుతుంది. ఇది జరిగి రెండు నెలలు అవుతున్న ఇప్పటి వరకు అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై రోజంతా నీరు ప్రవహిస్తుందని స్థానికులు అటూ పంచాయతీ అధికారులకు, ఇటు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై జోరుగా నీరు ప్రవహించడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు చెబుతున్నారు. దీంతో పాటు పామర్రులోని పలు ప్రాంతాలకు పైప్‌లైన్ పాడైపోయివడం వల్ల తాగునీరు సక్రమంగా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బందిని అడిగితే అది మా పని కాదని చెబుతున్నారని పంచాయతీ అధికారులను అడిగితే విద్యుత్ శాఖ సిబ్బందిని అడగమని చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బంది ఎదురవుతుందని వారు అంటున్నారు. పై స్థాయి అధికారులైన పట్టించుకుని పైప్‌లైన్‌ను బాగు చేయాలని స్థానికులు ప్రయాణికులు కోరుతున్నారు.

సినిమాలు



రామచంద్రపురం

రాజగోపాల్	:	శ్వాగ్
కిషోర్	:	దక్షిణ
శ్రీసూర్య	:	దేవర
ద్రాక్షారామ		
శ్రీలక్ష్మి	:	సత్యం సుందరం
శ్రీసూర్య	:	దేవర

నాడు అభివృద్ధిలో భాగస్వాములు

- నేడు పారిశుధ్య నిర్వహణలో బాధ్యులు
- ఇదీ కూటమి ప్రభుత్వంలో పాఠశాల యాజమాన్య కమిటీ(పీఎంసీ)ల దుస్థితి

రామచంద్రపురం రూరల్: నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాల పేరెంట్స్ కమిటీలుగా సేవలందించిన వారు గర్వంగా తలెత్తుకుని తిరిగేశారు. ఎందుకంటే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఏ ముఖ్యమంత్రి ఇవ్వనంతటి ప్రాధాన్యతను విద్యకు ఇచ్చి రూ.కోట్లతో నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశారు. ఈ అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీ సభ్యులను భాగస్వాములను చేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం పేరెంట్స్ కమిటీల పేరును గొప్పగా పాఠశాల యాజమాన్య కమిటీలుగా మార్చింది. కానీ వారిని పారిశుధ్య నిర్వహణలో బాధ్యులను చేస్తూ మరుగుదొడ్లకు ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని దీని కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారికి శిక్షణ ఇవ్వాలని కూడా కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో పాఠశాల యాజమాన్య కమిటీలుగా ఎంపికైన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. మరుగుదొడ్ల ఫొటోలు తీయడమంటే చిన్నతనంగా ఫీలవుతున్నారు. వారంలో బుధ, శుక్రవారాల్లో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల్లో ఒకరు, సోమ, గురు వారాల్లో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీసే డ్యూటీ చేయాలని కూటమి ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది.



వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి చేసిన నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ మరుగుదొడ్లు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
రామచంద్రపురం	84	6594
కె.గంగవరం	76	4287
కాజులూరు	78	4496
మండపేట	67	6517
రాయవరం	46	3363
కపిలేశ్వరపురం	51	3335

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ..



ప్రభుత్వ ఆదేశాల మేరకు వారంలో రెండు రోజులు వెల్ఫేర్ అసిస్టెంట్లు, రెండు రోజులు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని. ఎక్కడైనా అపరిశుభ్రత కనిపిస్తే ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలి. పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నాం.

– శ్రీపాద శ్రీలక్ష్మి నరసింహ ఫణి, డీవైఈఓ, రామచంద్రపురం

గత ప్రభుత్వంలో చైర్‌పర్సన్‌గా ఉన్నందుకు గర్వపడుతున్నా



గడచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పీఎంసీ చైర్‌పర్సన్‌గా పని చేసిందుకు గర్వపడుతున్నాను. ఎందుకంటే ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో సుమారు రూ.2 కోట్ల వరకు నిధుల కేటాయించి పాఠశాలలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి చేశారు. అంతే కాకుండా బాలికల జూనియర్ కళాశాలగా పాఠశాల స్థాయిని పెంచారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, దుస్తులు, బూట్లు, పాఠశాలకు నాణ్యమైన ఫర్నిచర్, మంచి నీటి సౌకర్యం, నాణ్యమైన సౌకర్యాలు ఒక్కటేమిటి అన్ని విధాలుగా అప్పటి సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సర్వతోముఖాభివృద్ధి చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో ఏమీ చేయడం లేదు.

– దొమ్మేటి దుర్గాభవాని, వెలంపాలెం, రామచంద్రపురం మండలం

21 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ విష్ణువర్ధన్

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సహాయకులకు తల్లీబిడ్డల సంరక్షణపై అవగాహన అవసరమని డాక్టర్ పి.విష్ణువర్ధన్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 21 మంది గర్భిణులను పరీక్షించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. వారిలో ఇద్దరిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన వైద్య పరీక్షలకు నివేదించారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోషక విలువలున్న ఆహారంపై హెచ్ఈ బి.రామారావు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ఈజెఎస్‌వై, ఆరోగ్య ఆసరా పథకాల అమలుతీరును వివరించారు. శిబిరంలో స్టాఫ్ నర్సు బి.శ్యామలరాణి, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, ఎంఎల్‌హెచ్‌పి, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహనకు గ్రామసభలు

రాయవరం: ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ బుధవారం తెలిపారు. వెదురుపాక, నదురుబాద గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,515 ఎకరాలలో పంట నమోదు పూర్తి చేశామన్నారు. 41,345 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ముందుగా ప్రతి గ్రామంలోనూ రైతు సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. గోనె సంచులు సమకూరుస్తామని చెప్పారు. ధాన్యాన్ని మిల్లుకు పంపించేందుకు రిజిస్టర్ అయిన వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందిగా మారిన మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇకపై రైతులు సమీపంలో తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందుకు గాను గ్రామ సభలో రైతులకు నచ్చిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకునేందుకు తీర్మానం చేస్తారన్నారు. తొలుతగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంట పొలాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్తి శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు కొవ్వూరి చంటిరెడ్డి, కొప్పిరెడ్డి తాతాజీ, వ్యవసాయ సహాయకులు తులసీధర్, శిరీష, రైతులు పాల్గొన్నారు.



వెదురుపాక 'పొలం పిలుస్తోంది'లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్



ఉట్రుమిల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

ఉట్రుమిల్లిలో పొలం పిలుస్తోంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లిలో ఏవో ఎస్. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రైతులకు వివిధ వ్యవసాయ పద్ధతులు, లాభసాటి వ్యవసాయం, రైతులకు ప్రభుత్వ సాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకున్న స్నేహితులు



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయవరం: ఒకటి కాదు..రెండు కాదు నాలుగు దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ అపూర్వ కలయికకు రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1979–80 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తిరిగి అదే పాఠశాలలో కలుసుకున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలలో కలిసేందుకు చిన్ననాటి స్నేహితులు చేసిన ప్రయత్నం ఫలించింది. 44 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహా పాఠశాలలో కలుసుకుని నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన 176 మంది విద్యార్థుల్లో 150 మంది విద్యార్థులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, కొంకుదుర, వెదురుపాక, వి.సావరం, బలభద్రపురం, కొప్పవరం, మహేంద్రవాడ, లొల్ల గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులంతా చదువులమ్మ చెట్టు నీడలో సేద తీరారు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రాంతాల్లో నివశిస్తున్న పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి కృషి చేసిన తాడి వెంకటలక్ష్మీనారాయణరెడ్డి దంపతులను మిత్రబృందం సత్కరించింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. చివరగా పూర్వ విద్యార్థులంతా తిరిగి మరోసారి తీపి జ్ఞాపకాలను మూటగట్టుకుని, గ్రూపు ఫొటోకు ఫోజులిచ్చి తిరిగి వెనుదిరిగారు.

సరస్వతీ కటాక్షంతో విజయాలు తథ్యం



రాయవరం శివాలయం వద్ద విద్యార్థుల సరస్వతీ పూజలు



సరస్వతీదేవిగా వెదురుపాక విజయదుర్గా అమ్మవారు



మండపేట జాంపేట వీధిలో సరస్వతీ పూజలు చేస్తున్న మహిళలు



అన్నపూర్ణాదేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారికి సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు



గాయత్రీదేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

- వెదురుపాక పీఠాధిపతి 'గాడ్'
- చిన్నారులకు అక్షరాభ్యాసం


రాయవరం: సరస్వతీ కటాక్షం తోడుంటే విజయాలు తథ్యమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) అన్నారు. పీఠానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి గాడ్ బుధవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతీ మాత కరుణా కటాక్షాలు కలగడం పూర్వ జన్మ సుకృతంగా పేర్కొన్నారు. జ్ఞాన సంపన్నులుగా మెలగాలంటే మంచి వాక్ శుద్ధి లభించాలన్నారు. అమ్మవారి దయకు పాత్రులు కావాలన్నారు. శరన్నవరాత్రుల్లో సరస్వతీ అవతారం ప్రాముఖ్యతను గాడ్ వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. పీఠంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఇక్కడి విజయదుర్గా అమ్మవారిని సరస్వతీమాత అవతారంలో అలంకరించి పూజలు చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో వేణుగోపాల్, విజయ దుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి భక్తులకు అన్న సమారాధన చేశారు.

వాడవాడలా ..

చిన్నారులకు విద్యాబుద్ధులు కలగాలని ఆకాంక్షిస్తూ విజయదుర్గా పీఠంలో బుధవారం సరస్వతీ పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు పీఠబ్రహ్మ శివ, చీమలకొండ వీరావధాని, చక్రవర్తుల మాధవాచార్యులు, తోలేటి నాగేంద్రశర్మ అర్చకత్వంలో సరస్వతీ అష్టోత్తర సహస్ర నామాలతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సరస్వతీదేవి ప్రతిమను, రక్షా బంధనాన్ని ప్రసాదంగా అందజేశారు.



కొత్తూరురోడ్డులోని సరస్వతీగా కనకదుర్గమ్మ అమ్మవారు



పామర్రు మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

పీఠాధిపతి గాడ్ సమక్షంలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి గుడిలో అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మల ఆధ్వర్యంలో చిన్నారులతో సరస్వతీ పూజలు చేయించారు. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో చిన్నారులతో సరస్వతీ పూజలు చేయించారు. చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, పసలపూడి శివాలయంలో నిర్వహించిన సరస్వతీ పూజల్లో అధిక సంఖ్యలో చిన్నారులు పూజలు చేశారు.

జాంపేటలో..

మండపేట: శరన్నవరాత్రుల ఏడో రోజైన బుధవారం మండపేట పట్టణం, మండలంలో కొలువైన దుర్గామాత విశేష పూజలు అందుకున్నారు. దుర్గాదేవి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రావులపేట జాంపేట వీధిలోని దుర్గమ్మను సరస్వతీ మాతగా అలంకరించి విశేష పూజలు చేశారు. చుట్టుపక్కల వీధుల మహిళలు తమ పిల్లలతో కలసి సరస్వతీ పూజ చేశారు. కమిటీ సభ్యులు మోరం పాపారావు, దేవళ్ల శ్రీనివాస్‌చౌదరి, యాళ్ల దుర్గాప్రసాద్, రావూరి కోటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. పెన్నులు, పుస్తకాలు పూజల్లో ఉంచి విద్యార్థులకు పంచి పెట్టారు. మండలంలోని ఏడిద సీతానగరంలో 70 మందికి పైగా భక్తులు భవానీ మాలధారణ చేశారు. వారంతా వారం రోజులుగా దుర్గామాతను కొలుస్తున్నారు. సర్పంచ్ వరదా చక్రవర్తి, భవానీలు కలసి అమ్మవారి పేరున గ్రామంలో బుధవారం అన్న సంతర్పణ నిర్వహించారు.

వీణాపాణీ నమోస్తుతే..

రామచంద్రపురం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజున బుధవారం పట్టణంలోని కొత్తూరు జోడు తూముల వద్ద ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీ దేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుపల్లి గణేష్ శర్మ నేతృత్వంలో అర్చకస్వాములు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: దేవి నవరాత్రుల్లో భాగంగా బుధవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసి అమ్మవారి శిబిరాల వద్ద వేద పండితుల బ్రహ్మత్వంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన చిన్నారులు ఈ పూజల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

చిన్నారుల సరస్వతీ పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు దేవాలయాలు, శరన్నవరాత్ర వేదికల వద్ద బుధవారం చిన్నారులు భక్తి శ్రద్ధలతో సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారి సన్నిధిలో ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్వతీ పూజల్లో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు. వారందరికీ పూజల్లో ఉంచిన నోటు పుస్తకాలు, పెన్నులు అమ్మవారి కానుకగా అందించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో బుధవారం అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమను సరస్వతీ దేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో సరస్వతీ దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి దేవిని అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్ పూజల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకుడు బొండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.



సోమేశ్వరంలో సరస్వతీ పూజలు చేస్తున్న చిన్నారులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు



సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి